పూలమనసులు

జనస్వామి కోదండరామశాస్త్రి. సూర్యదేవర రవికుమార్

సాయంసంధ్యా సమయం. పగలంతా సగం ప్రపంచాన్ని పర్యవేక్షించిన సూర్యుడు అసంతృప్తితో అసహనంతో వడివడిగా ఈ భూభాగాన్ని దాటుకొంటూ రెండవ సగం ప్రపంచంవైపు పరుగులుతీస్తున్నాడు. అసలు తనకంటూ ఒక రంగే లేని ఆకాశం రకరకాల రంగులను పులుముకొంటోంది. వాటన్నిటిని తుడిపేస్తూ నల్లని చీకటి క్రమంగా వ్యాపిస్తోంది. పేదవానిజీవితంలో మైలురాళ్ళలా ఆకాశంలో ఒకటి రెండు చుక్కలు కనబడీ కనబడనట్లున్నాయి.

అప్పుడే తూర్పు పొలం నుంచి ఇంటికి చేరిన కోటయ్యగారు కాళ్ళు కడుక్కొని అలవాటు ప్రకారం బయటి అరుగు మీదకు చేరేసరికి వీధిచివరకు అల్లంత దూరంలో పడమరగా ఉన్న వంతెన దగ్గర ఏదో అలజడి జరుగుతున్నట్లు పసికట్టారు. ఈ వేళప్పుడు వంతెన దగ్గర గొడవేమిటో. అని ఆలోచిస్తూ వెంకన్న కోసం చావిడివైపు చూచారు. చావిట్లో ఎవరూ ఉన్నట్లు అనిపించలేదు. 'వెంకన్నా' అని పిలిచారు పెద్దగా. జవాబు లేదు. చావిడి దొడ్డి తలుపులు బార్లా తీసే ఉన్నాయి. లోపలికి వెళ్ళి చూచారు. వెంకన్నగాని ఇంకో పాలేరుగాని లేరు. కొన్ని గొడ్లదగ్గర మేత సర్దనేలేదు. కోటయ్యగారికి ఎటూ తోచక చికాకేసి మళ్ళీ వచ్చి అరుగు మీదనె కుర్చోబోతుండగా ఇంటి పనిమనిషి లచ్చి దొడ్డి వాకిలివైపు వెళ్తూ కనిపించింది.

'ఏంటే లచ్చి! వంతెన దగ్గరనుంచి ఏవో కేకలు విన్పిస్తున్నాయి. ఏమిటా హడావుడి' అడిగారు.

లచ్చి ఒక క్షణం తటపటాయించింది. 'అదాండీ...' అంటూ నాన్చింది.

'అదేనే! ఏమిటా గోల?' గద్దించారు కోటయ్యగారు.

అదేనండి...మన ఎంకన్నండి...'

'ఓసి నీ దుంపతెగ! ఏమైందే వెంకన్నకి? చికాకు. ఆదుర్దా కలిసి పోయాయి కోటయ్యగారి మాటల్లో.

'మరేంలేదండి. ఆ ఎంకన్నండి...మనింటోనే దొంగతనం చేశాడండి'

'ఏంటే నువ్వు మాట్లాడేది? వెంకన్న మనింట్లో దొంగతనం చేశాడా? ఎవడే నీకు చెప్పింది? సంజవేళ అబద్ధపు కూతలు కూస్తావా?'

'అబద్ధం కాదండి దొరగారూ నిజవేనండి. ఎంకన్న దొంగతనం చేస్తే పెదబాబుగారు పట్టుకున్నారండి. అడికి బాగానే బుద్ది సెపుతున్నారండి'.

కోటయ్యగారు నుదురు చిట్లించి 'వెంకన్న దొంగతనం చేశాడా? పెదబాబు పట్టుకున్నాడా?' అని ఆశ్చర్యపడి పైపంచె వల్లెవాటుగా వేసుకొని చావిడిలోకి వెళ్ళి చేతికర్ర తీసుకొని మీసం సవరించుకొంటూ వంతెన దగ్గరకు బయలు దేరారు.

కోటయ్యగారు వంతెన దగ్గరకు చేరుకోగానే 'దొరగారొస్తున్నారు, దొరగారొస్తున్నారు.' అంటూ అక్కడ మూగిన జనం పక్కకు తప్పుకున్నారు. వాళ్ళు తప్పుకోగానే ఆ వంతెన పక్కనున్న వేపచెట్టుకు పెడరెక్కలు విరిచి కట్టివేయబడ్డ

వెంకన్న, అయాసపడుతూ మాటలు తూలుతూ చేతిలో తాటఊడిన వేపబెత్తంతో పెదబాబు కన్పించారు కోటయ్యగారికి. ఆయన ఇంకా దగ్గరగా వెళ్ళి వెంకన్న ముఖంలోకి చూడగానే అప్పటిదాకా ఐశ్వర్య అహంకారాలు చేసిన అమానుష హింసను సహనతా భావంతో తట్టుకొన్న వెంకన్న తలవంచుకొని 'నేను దుర్మార్గుణ్ణి దొరగారూ మీ యింటోనే దొంగతనం చేశాను' అంటూ ఏడ్చాడు. అది పశ్చాత్తాపంతో వచ్చే ఏడుపు కాదని, తరతరాల బడుగువర్గాల వేదనార్ణవ ఘోష అని కోటయ్యగారు గ్రహించారు.

పెదబాబు ఏదో మాట్లాడబోయి తండ్రి కళ్ళ కెంపుల్ని చూచి ఆగిపోయాడు.

'ముందా కట్లూడదీయండి' కోటయ్యగారి మాట సింహగర్జనే అయింది.

వెంకన్న కట్లు విప్పబడ్డాయి. 'నాతోరా వెంకన్నా' అంటూ ఇంటివైపు దారితీశారు కోటయ్యగారు. వెంకన్న ఆయన ననుసరించాడు. వాళ్ళిద్దరినీ పెద బాబునూ చూస్తూ ఆ గుంపులో ఎవరో పళ్ళు పటపట కొరికారు.

మేడమీద గదిలో పందిరి మంచంమీద బాసింపట్టు వేసుకొని కూర్చున్నారు కోటయ్యగారు. ఆ గదిలోనే వాకిలి కానుకొని లోపలి పక్కన కూర్చున్నాడు వెంకన్న. కోటయ్యగారికి, వెంకన్నకు ఒకే ఈడు వుంటుంది. దాదాపు నలభై సంవత్సరాలనుంచి ఇద్దరూ కలిసి మెలిసి అన్నదమ్ములకన్న ఆత్మీయులై ఉంటున్నారు. అయితే వాళ్ళ అంతస్థులు వేరు. కాని అంతఃకరణలు ఒకటే. వెంకన్న తన ఇంట్లో దొంగతనం చేయలేదని, చేయలేడని కోటయ్యగారికి తెలుసు. అయితే ఆ మాట వెంకన్న నోటవినాలని కోటయ్యగారెంతో ఓపికపట్టి ఎంతో వాత్సల్యంతో ఎన్నోవిధాల అడిగి చూచాడు. ఎన్నిసార్లడిగినా "దొరగారూ! నా బుద్ధి గడ్డి తింది. నేనే దొంగతనం చేశాను" అన్నమాట తప్ప వేరే మాట రావటంలేదు వెంకన్న నోటినుంచి. తను ఇన్నాళ్ళు చూచిన వెంకన్న వేరు ఈనాటి వెంకన్న వేరు అని అర్థమైపోయింది కోటయ్యగారికి. అతనిచేత నిజం చెప్పించేందుకు ఒకే ఒక మార్గం కన్పించింది వారికి.

"అయితే నీ మాట నీడిగాని నిజం చెప్పవన్నమాట. నలభై సంవత్సరాలుగా నువ్వూ నేను ఎట్లా బ్రతికామో మనిద్దరికే తెలుసు. మనిద్దరి మధ్య వున్న ప్రేమ, అభిమానం, వాత్సల్యం యీనాటితో తెగతెంపులు చేసుకున్నావన్నమాట. అందుకే తెగించి నా యింట్లో దొంగతనం చేశానని అంటున్నావు. నా మీద గౌరవం అభిమానం చంపుకొని నా యింట్లోనే దొంగతనం చేయటానికి నీకు ప్రాణం ఒప్పిందేమో కాని వెంకన్నా! ఆ దొంగతనం నిజంగా నువ్వే చేశావంటే నేనింక ప్రాణాలతో ఉండలేనురా. చూడు! నా గుండె బద్దలైపోతోంది. నా మెదడులో నరాలు తెగిపోతున్నాయి. నేనీ అవమానాన్ని భరించలేను. పోతున్నాను వెంకన్నా! పోతున్నాను. నిన్నేకాదు యీ లోకాన్నే విడిచిపెట్టి పోతున్నాను" ఆవేశంగా మంచంమీద కూర్చొని ఊగుతూ అంటున్నారు కోటయ్యగారు. ఆయన ముఖం నెత్తురు గడ్డలా మారింది. శరీరం ఆయన స్వాధీనాన్ని తప్పిపోతున్నట్లనిపించింది వెంకన్నకు. ఆయన కళ్ళు మూతలు పడుతున్నాయి మనిషి ఊగిపోతున్నాడు. పెదాలు నిశ్శబ్దంగా కదులుతున్నాయి.

ఆయన పరిస్థితిని చూచిన వెంకన్నకు కాళ్ళు చల్లబడ్డాయి. ఇంకేముంది. దొరగారు చనిపోతున్నాడనుకొన్నాడు. ఒక్క ఉదుటున లేచివెళ్ళి కోటయ్యగారి భుజాలు పట్టుకొని "దొరగారూ! దొరగారూ! నిజం చెపుతున్నానండి. నేను దొంగతనం చేయలేదండి. నేను దొంగను కానండి బాబూ! మిమ్మల్ని చూస్తే నాకు బయం పుడతందండి. మాట్లాడండి బాబూ! మాట్లాడండి." అంటూ మనిషిని ఊపుతున్నాడు. కన్నీళ్ళు కారుస్తున్నాడు. 'నేను దొంగను కాదండి. మాట్లాడండి బాబూ!" దుఃఖాన్ని, ఎక్కిళ్ళను ఆపుకొంటూ పదే పదే అంటున్నాడు వెంకన్న.

80 సెకండ్ల కాలం గడిచిపోయింది.

'ఏమంటున్నావు వెంకన్నా! నువు దొంగతనం చేయలేదాః' మెల్లగా మాట్లాడారు కోటయ్యగారు.

'నిజం దొరగారూ! నేను దొంగతనం చేయలేదు'

'చాలు వెంకన్నా! నాకా మాట చాలు' కళ్ళు తెరచి లేచి వెంకన్న భుజం మీద చేయివేసి అతన్ని కూర్చోబెట్టి తనూ కుర్చీలో కూర్చున్నారు కోటయ్యగారు.

కాలం భారంగా నడుస్తోంది.

'నాకు తెలుసు వెంకన్నా! ఇది నీ పనికాదని. ఏదో దారిన వెళ్ళవలసింది నీ నెత్తిన పడిందని...అయితే నిజాన్ని ఇంతగా నా దగ్గర కూడ దాచాల్సిన అవసరం ఏమొచ్చిందిః

'వచ్చింది బాబూ. నా ప్రాణం మీదకు వచ్చింది. అందుకే అబద్ధమాడాను. మిమ్మల్ని బాధపెట్టాను'

'చెయ్యని దొంగతనం నీ ప్రాణం మీదకొచ్చిందాః'

'అవును బాబూ! దొంగతనం నే చెయ్యకపోయినా చేశానని ఒప్పుకోపోతే నా శవాన్ని కూడ దొరకనీయనన్నాడు పెదబాబు. ఈ వయసొచ్చాక ప్రాణానికి భయపడే పనిలేదు. కాని...' దుఃఖం ఆపుకోలేకపోయాడు వెంకన్న మాట పెగిలిరాలేదు.

కొంచెం తెప్పరిల్లిన తర్వాత 'కాని...నా కొడుకే బతికుంటే యీ అబద్ధం ఆడేవాణ్ణే కాదు. ఇవాళ నే లేకపోతే ఆడపిల్లలు, పెళ్ళాం దిక్కులేనోళ్లౌతారు. అందుకే ఆ నేరం నెత్తినేసుకున్నాను బాబూ!' అన్నాడు వెంకన్న.

కొన్ని క్షణాలు మౌనం రాజ్యం చేసింది. తర్వాత కోటయ్యగారే అన్నారు.

'జరిగిందేదో జరిగిపోయింది. నిన్నంటుకొనే వాడుండడు. నేను హామీ ఇస్తున్నాను. ఒకవేళ నిన్ను శవాన్ని చేయాలని ఇంకా ఎవడైనా ప్రయత్నం చేస్తే వాడే నీకన్నా ముందుగా శవమయ్యేలా నేను చూస్తాను. నువ్వేం భయపడవద్దు. నిబ్బరంగా ఉండు. అసలు ఇదంతా జరిగిన తీరు చెప్పు'

వెంకన్న మాట్లాడలేదు. తలవంచుకొని మౌనంగా ఉండిపోయాడు.

'చెప్పు వెంకన్నా! అసలేం జరిగిందో చెప్పు' ఎంతో అనునయంగా అడిగారు కోటయ్యగారు.

'ఏం చెప్పమంటారు!' అని నిట్టూర్చి 'మన పెదబాబుగారి నడత కొన్నాళ్ళనుంచి బాగుంటంలేదండి' ఉపోద్ఘాతంగా అన్నాడు వెంకన్న.

'అవును. వాడు ఒక ఉంపుడుగత్తెతో కులుకుతున్నాడు'

'దాని పేరండీ...'

'సరస్వతి. దానికి ఉత్తరపు వీధిలో ఉన్న ఇల్లు వీడు బాగుచేయించి పెట్టాడు. ఆ సంగతులన్ని నాకు తెలుసుకాని అసలు విషయం చెప్పు'

'బాబూ! యీ సంగతులన్నీ మీకు తెలిశాక నేనేమీ దాయగూడదు. జరిగింది జరిగినట్టు చెపుతాను.

సాయంత్రం చావిట్లో గొడ్లకి మేత సర్దుతున్నాను. అప్పుడే పెదబాబుగారొచ్చి 'ఎంకన్నా! నీ పనయ్యాక యీ పైకం సరస్వతి కిచ్చిరా!' అని నా చేతిలో రెండు వంద కాయితాలు పెట్టారు. బాబుగారు చెప్పినట్టే నా పనయ్యాక ఆ అమ్మ ఇంటికెళ్ళాను. నేనెళ్లేసరికి ఆమె బంగారపు గాజులు తొడుక్కొని చూసుకుంటోంది. నేనెళ్లి డబ్బిచ్చానండి. అప్పుడంది గదా! 'ఎంకన్నా గాజులు బావున్నాయా! సంపాయించాను చూడు' అని చూడమని తీసి నా చేతికిచ్చిందండి. నేను చూచి 'బాగున్నయ్యండి. ఎక్కడ సంపాయించారేంటిః అన్నాను. 'మీ దొరగారి కోడలి దగ్గర్నుంచి తెప్పించానురా' అని ధీమాగా అందండి. 'ఎట్టా

తెప్పిచ్చారేమిటి' అనడిగాను. దానికామె నవ్వి నేనిచ్చిన డబ్బు చూపించి 'యీ డబ్బెట్టా తెప్పించానో అవీ అట్టాగే తెప్పించారు. యీ డబ్బిచ్చి పంపినాయనే అవీ ఇచ్చి పంపాడు' అందండి.

ఆ మాట యినేసరికి నాకు ఒళ్లు మండిపోయి 'ఎంతకి తెగించావు. వారి ఆడోళ్ల ఇవి పోయాయనుకొని గోలెడుతున్నారు. నేను ఇవి తీసుకెళ్ళి వాళ్ళకి అప్పచెప్తాను' అని చెప్పి ఆమె ఎన్ని కేకలు పెట్టినా యినిపించుకోకుండా మనింటికొచ్చేశానండి. నాకన్నా ముందే ఆవిడ ఎవరితో కబురు చేసిందోమరి నేనింటిగడప లెక్కుతుంటే పెదబాబు నాకెదురొచ్చి నన్ను చావిట్లోకి రమ్మనమని చెప్పి తీసుకెళ్ళి కొట్టారు. నా దగ్గర్నుంచి ఆ గాజులు లాక్కుని బొడ్లోనుంచి కత్తి తీసి చూపించి 'యీ గాజులు మనింటోనుంచి నువు దొంగతనం చేసి తీసుకొచ్చావని ఒప్పుకోకపోతే ఇదిగో యీ కత్తితో నీ ఊపిరి తీస్తా' నన్నారండి. సరస్వతి పేరుగాని, తన పేరుగాని యీ దొంగతనంతో ముడిపెడితే చంపుతానని కత్తి పైకెత్తారండి. అప్పుడు పెదబాబును చూస్తే నిజంగా చంపుతాడేమోనని బయమేసి నా కోడలు పిల్లలు గుర్తొచ్చి 'అట్టాగే బాబూ! ఆ దొంగతనం నేనే చేశానని ఒప్పుకుంటాను' అన్నానండి. అంతే. పెదబాబుగారు పెద్దగా కేకలేసి నన్ను చేయి పట్టుకొని బయటకు లాక్కెళ్ళి వంతెన దగ్గర చెట్టుకు కట్టేసి అందర్లోను నన్ను దొంగను చేశారండి. ఆ అవమానంతో చావాల్సిందే గాని, అదుగో ఆ మగదిక్కులేని పిల్లల్ని చూచి బతికున్నానండి.' బావురుమన్నాడు వెంకన్న ముఖానికి పై గుడ్డను అడ్డం పెట్టుకొని.

భూతదయ అత్యున్నతమైంది, పవిత్రమైంది. దానికి తరతమ భేదాలు కాని కలిమిలేముల వ్యత్యాసాలుగాని ఉండవు. మానవతా అస్తిత్వానికి అదే ఆధార భూతం. అదిలేని మానవత పాశవతే. చంద్రోదయానికి చంద్రకాంతశిలలు ద్రవించినట్లు అసాధారణ దయనీయ సంఘటనలకు మానవత కొందరి హృదయాలలో పొంగి పొరలుతుంటుంది. ఆ దయాహృదయాలే ధర్మసంస్థాపన కాధార భూతాలౌతాయి.

వెంకన్న రోదన కోటయ్యగారి హృదయంలో దయాసముద్రాలను పొంగించింది. అవి ఆయన కళ్ళగుండా బయటకు ప్రవహించాయి. కొంచెం తేరుకున్నాక వెంకన్న చేతులు పట్టుకొంటూ అన్నారు కోటయ్యగారు.

'నీకు జరిగిన అన్యాయం నాకు తెలియకుండా జరిగింది. ఇప్పుడు అంతా తెలిసింది. ఇక నీకు భయంలేదు. అకారణ దౌర్జన్యాలు అపరాధ మూల్యాలను తప్పకుండా చెల్లిస్తాయి. పెదబాబుతో నేను మాట్లాడుతాను. నువు ఇంటికి వెళ్ళు.'

వెంకన్నను సాగనంపి పెదబాబుకు కబురు చేశాడు కోటయ్యగారు.

* * *

మేడమీద గది గుమ్మం చేరగానే తన ఉనికిని తెలియజేస్తూ చిన్నగా గొంతు సవరించుకున్నాడు పెదబాబు. పట్టెమంచం మీద నడుం వాల్చిన కోటయ్యగారు ఆ అలికిడికి లేచి పెదబాబు నుద్దేశించి 'కూర్చో' అని చెప్పాడు. పెదబాబు కుర్చీలో కూర్చున్నాక 'గాజుల దొంగతనం ఎవరు చేశారురా?' అంటూ సౌమ్యంగానే అడిగారు కోటయ్యగారు.

'వెంకన్నే'

'అతడు చేయలేదని ఋజువైతే'

పెదబాబు మాట్లాడలేదు.

'చూడు పెదబాబూ! గదిలో అరమరలో పెట్టిన నీ భార్య గాజులు వెంకన్న దొంగతనం చేశాడని నువు ఆరోపిస్తే అది నిలబడదురా! మనలో ఒకడుగా ఏనాటినుంచో మనింట్లో తిరుగుతున్న వెంకన్న బుర్రలో దొంగబుద్ధే వుంటే మనం యీనాడు యీ స్థితిలో ఉండేవాళ్ళం కాదు. నీకు తెలియదు. వెంకన్న దేవుడులాంటివాడు. అతణ్ని మందిరంలో కూర్చోబెట్టి పూజచేసినా అతని ఋణం మనం తీర్చుకోలేము. ఈనాటి మన యీ భాగ్యసౌధానికి అతడు పునాదిరాయి. అతడి అమాయకత్వం, విశ్వాసం వలన మన మీనాడీ ఐశ్వర్య జీవితాలను వెళ్ళబుచ్చగలుగుతున్నాం. యీ ఐశ్వర్యం దాని బాపతు అహంభావం, దౌర్జన్యం మనకి రక్షా కవచాలని అనుకొంటే అది కేవలం భ్రమే అవుతుంది, అవి మన వినాశానికి హేతువులు...నిజానికి నువ్వు ఇవాళ అవమానించింది వెంకన్నను కాదురా...నన్ను...నన్నేరా...'

'నాన్నగారూ' దిగ్భ్రాంతిగా అన్నాడు పెదబాబు.

'అవున్రా! ఆ అవమానం నాకే. అయినా అసలు విషయం నీకు తెలియదు. తెలిస్తే వెంకన్ననిలా అవమానించి ఉండవు. నలభై సంవత్సరాలనాడు మన ఆస్తి కేవలం రెండెకరాలే. దాంతోపాటు మరొక నాలుగెకరాల పొలం కౌలుకు తీసుకొని సంసారాన్ని నెట్టుకు వస్తున్నాం. అప్పటికి నాకింకా పెళ్ళి కాలేదు. అప్పుడు కూడ యీ వెంకన్న మనింట్లోనే పని పాటలు చేస్తుండేవాడు. వెంకన్నకు తల్లి, తండ్రి చిన్నప్పుడే చనిపోయారు. అతడి బాబాయి వెంకన్నను పోషించలేక మనింట్లో పనికి పెట్టాడు. మనింట్లోనే తిని, మనింటిదగ్గరే పడుకొంటూ మనలో ఒకడుగా ఉండేవాడు. ఒక వేసవికాలం పొలాన మట్టిదిబ్బ తవ్వుతున్నాం నేను, వెంకన్న. ఆ రోజు సాయంత్రం మొత్తం పనంతా వెంకన్నమీదే పెట్టి నేను ముందే ఇంటికి వచ్చేశాను ఒంట్లో బాగుండక. ఆ రోజ రాత్రి బండిని ఇంటికి తీసుకువచ్చి అందులోనుంచి రెండు ఇత్తడి పెట్టెలు దించి ఇంటిలో పెట్టాడు వెంకన్న. ఇవెక్కడివని అడిగితే మట్టిదిబ్బలో దొరికాయని చెప్పాడు. అంతే. అంతకుమించి ఆ రోజునుంచి ఈ రోజు వరకు ఆ పెట్టెల విషయం ప్రస్తావించనేలేదు వెంకన్న. ఆ రాత్రి మేము పెట్టెలు తెరిచి చూచాము. వాటిలోనుంచి అదృష్టదేవత లేచివచ్చి మాతో కరచాలనం చేసినట్లయింది. అందులోని బంగారు నగలు, ముత్యాలు, పగడాలు చూచాక, ఆ విషయం చాల జాగ్రత్తగా దాచి, ఏమాత్రం బయట పడనీయకుండా జాగ్రత్తపడి ఆ ఏడే ఆ ఊరి పొలం అమ్మేసి ఇదిగో ఈ ఊరు వచ్చి పడ్డాం. అమాయకుడు, విశ్వాసపాత్రుడు అయిన వెంకన్నను కూడ మాతో తీసుకొచ్చాం. ఇక్కడికి వచ్చాకే మా ఇద్దరికీ కూడ పెళ్ళిళ్ళయ్యాయి. వెంకన్న చేసిన ఆ సహాయానికి కృతజ్ఞతగా ఎన్నోసార్లు నేనతనికి సహాయం చేస్తానని చెప్పినా అతడు అంగీకరించలేదు. 'ఈ జన్మకి యీపాటి బతుకు చాలు బాబూ! నాకంటూ ఆస్తిపాస్తులేర్పాటు చేస్తే మీకూ నాకూ ఎడమౌతుంది, అది నాకిట్టం లేదు.' అంటుండేవాడు. నేనింకా అతడిని ఆ బ్రతుకులోనే ఉంచినందుకు విచారిస్తూ ఉంటే ఇవాళ నువు చేసిన పనికి నేనేం చేయాలో చెప్పు. మనలో మానవత్వం ఉందా? మానవులమని చెప్పుకొనేదానికి మనకి హక్కుందా? చెప్పురా! చెప్పు నీ స్వార్థం కోసం, నీ ప్రయోజనం కోసం, నీ పరువు కోసం, అమాయకుడైన వెంకన్ననే శవంగా చేస్తావో... తర్వాత నన్నే శవంగా చూస్తావో...నీ యిష్టం' కోటయ్యగారి గొంతు గద్గదికమైంది.

పెదబాబు ముఖంలో కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు. మౌనంగా ఆ గది నుండి బయటకు వెళ్ళిపోయాడు.

* * *

ఇంకా తూరుపు తెలవారలేదు. సొట్టపడిన ముఖంతో నట్టనడి ఆకాశాన బహుళాష్టమి చంద్రుడు వెలవెలబోతూ తరపి వెన్నెలను ప్రసరిస్తున్నాడు. ప్రత్యూష పవనాలు మందగమనంతో సంచరిస్తున్నాయి. ఆ పిల్లగాలుల తాకిడికి నిద్రలేచిన కోటయ్యగారు అలవాటు ప్రకారం కాలకృత్యాలు తీర్చుకొని నోటిలో ముఖంపుల్లతో చేతిలో ఇత్తడి నీటిచెంబుతో ఇంటి బయటి అరుగు మీదకు వచ్చి చెంబు దానిమీద పెట్టి చావిడివైపు చూచారు. రోజు అలవాటు చొప్పున చావిడి

లోని గొడ్లను బయట కట్టేస్తున్నాడు వెంకన్న. కోటయ్యగారు చావిట్లోకి వెళ్తున్న వెంకన్నను పిలిచారు. చేసే పని ఆపేసి దగ్గరగా వచ్చాడు వెంకన్న.

'చూడు వెంకన్నా! నువు యీ రోజునుంచి నౌకరుగా నా దగ్గర చాకిరీ చేయనక్కరలేదు. యీరోజే నీ పేరుమీద నాలుగెకరాల మాగాణి భూమి దస్తావేజు వ్రాయించి రిజిష్టరు చేయించదలచుకొన్నాను. దాంతోపాటు పదివేల రూపాయలు బ్యాంకులో నీ పేర జమ కడతాను. ఆ రెంటిమీద వచ్చే రాబడితో నువు రోజులు వెళ్ళబుచ్చుకో. యీసారి మాత్రం నా మాటకు అడ్డు చెప్పవద్దు... మధ్యాహ్నం నాకొకసారి కన్పించు.' తన నిర్ణయాన్ని చెప్పి తేలికపడ్డ మనసుతో అరుగుమీదకు చేరారు కోటయ్యగారు.

వెంకన్న స్థాణువులా నిలబడిపోయాడు కాసేపు.

భోజనం పూర్తి చేసుకొని గొడుగు తీసుకొని వెంకన్న కోసం ఎదురుచూస్తూ ఇంటి వసారాలోని వాలు కుర్చీలో కూర్చున్నారు కోటయ్యగారు. కొద్దిసేపటికే వెంకన్న, అతడి భార్య వచ్చి ఎదురుగా నిల్చున్నారు.

'ఇద్దరూ వస్తున్నారా! మంచిపని చేశారు. బయల్దేరదామా'

వెంకన్న ఏమి మాట్లాడలేదు. అతడి భార్య మాత్రం' మా గురించి మీకింత శ్రమ ఎందుకు దొరగారూ! మేమే ఊరొదిలి వెళ్తున్నాం' అంది.

అదిరిపడ్డారు కోటయ్యగారు.

'ఊరొదిలి వెళ్తున్నారా? ఏం? ఏమయింది? మళ్ళీ ఎవరైనా...'

'అదేంలేదు బాబూ! మీకు మా చాకిరీతో పనిలేదని మీరన్నాక ఈ ఊళ్ళో మాకింకెవరితో పనుంది? మీకు చాకిరీ చేసిన ఈ చేతుల్తో ఈ ఊళ్ళోనే ఇంకోరికి చేయలేం. అందుకే ఊరొదిలేసి...' వెంకన్న భార్య ఇంకేదో చెప్పబోయింది.

కోటయ్యగారి గుండెల్లో బాంబు పేలినట్లయింది. మనిషి ఉక్కిరిబిక్కిరైపోయారు. 'చాల్లే ఆపు' అని బిగ్గరగా అరిచారు.

తర్వాత మెల్లగా 'మీకు ఊళ్ళో పొలమిస్తానంటే ఊరొదిలి వెళ్తానంటారేం' అన్నారు.

'ఇన్నాళ్ళు మీ అండన బతికాం. ఆ అండ మాకు లేకపోయాక పొలాలు పుట్రలు ఏం చేసుకోను దొరగారూ!' వినయంగా అంది వెంకన్న భార్య.

'ఏం వెంకన్నా! నువ్వేమంటావ్'

'నా మాటా అదేనండి. ఈ బతుకుల్ని మీ దగ్గరే తెల్లారనీండి'

కోటయ్యగారు సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు. ఇంతటి ఆత్మీయత, ప్రేమ, విశ్వాసం, నిస్వార్థం నిండిన వీళ్ళ హృదయాలు హరిమందిరాలు. హరిజనులని గాంధీగారు వీళ్ళకి పెట్టిన పేరు ఎంతో సార్థకమైనది. శ్రమైకజీవన సౌందర్యానికి సాక్షాత్ప్రతిరూపాలు వీళ్ళు. నిష్కలంక హృదయాలకు నిలువెత్తు ప్రతిబింబాలు వీళ్లు. వాగర్థాల్లా విడదీయలేని పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యక్ష స్వరూపాలు వీళ్ళు. కోటయ్యగారి హృదయం వాళ్ళ వ్యక్తిత్వానికి సాష్టాంగ ప్రమాణం చేసింది. ఆయన తనకు తెలియకుండానే చేతులెత్తి వాళ్ళకు నమస్కారం చేశాడు.

'ఏం సెలవిచ్చారు బాబూ!' వెంకన్న మెల్లగా గొణిగాడు.

కోటయ్యగారు తేరుకొని ఇలా అన్నారు 'ఏమంటాను వెంకన్నా! శివపార్వతులు నా ఇంటిలో ఉంటానంటే కాదంటానా!'

'మీరుండమన్నారు. అంతే చాలు బాబూ' వెంకన్న. అతడి భార్య కళ్ళల్లో కోటిదీపాలు వెలిగాయి.

ఆ ఊర్లో కోటయ్యగారిని ద్వేషించేవాళ్ళు లేరుగాని పెదబాబుకు మాత్రం చెప్పుకోదగినంత వైరివర్గం వుంది. ఒక హరిజనుడిని అగ్రవర్ణాలవారు చెట్టుకు కట్టి కొట్టారనే ఫిర్యాదు రావటంతో విచారణకై తగిన అధికార యంత్రాంగం ఆ ఊరు చేరుకొంది. నిజానికి తనను కొట్టినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్టు వెంకన్నకు తెలియనే తెలియదు. ఫిర్యాదు చేసిన తరువాత చేసినవాళ్ళు వెంకన్న ఇంటికి వచ్చి ఎంతో హితబోధ చేశారు. అతనికి అన్యాయం జరిగిందంటూ మొసలి కన్నీరు కార్చారు. పెత్తందారీ వర్గంమీద కారాలు మిరియాలు నూరారు. ఎన్నో రాజకీయసిద్ధాంతాలు వల్లెవేశారు. ఇవేవీ వెంకన్నను ప్రభావితం చేయలేకపోయాయి.

విచారణకు వచ్చిన ప్రభుత్వోద్యోగులు వెంకన్నను పిలిపించి జరిగిన విషయం చెప్పమన్నారు.

'ఏం జరిగింది బాబూ! ఇక్కడ ఏ దుర్మార్గం జరగలేదు. ఎవరి ప్రాణాలు పోలేదు. జరిగిందేంటంటే రైతుకి పాలేరుకి మధ్య చిన్న కీచులాట అంతే! అంతకన్న ఏం లేదు. అది మేము మేము సర్దుకొనేదే. దానికి మీ అవసరం లేదు.'

ఎన్నివిధాల అడిగినా అదే సమాధానం చెప్పాడు వెంకన్న ఫిర్యాదు చేసిన వాళ్లు నిరాశచెంది వెంకన్ననే తూలిమాట్లాడారు. విచారణకు వచ్చినవాళ్లు తిరిగి వెళ్లారు చేసేదేమీలేక.

ఆ సాయంత్రం వెంకన్నను మేడమీదకు పిలిపించారు కోటయ్యగారు.

'ఏం వెంకన్నా! తప్పు చేసినవాడికి శిక్ష పడకుండ చేశావేమిటి? తప్పుడు వాఙ్మూలం ఇచ్చావేంటి?' ఆశ్చర్యంగా అడిగారు కోటయ్యగారు.

'నేను నిజం చెపితే ఏమవుద్దో, నాచేత నిజం చెప్పించి మీ కుటుంబాన్ని ఏం చేయించాలనుకుంటున్నారో నాకు తెలిసింది బాబూ! అన్నం పెట్టిన చేతిని నరికేవాడు కాదు బాబూ వెంకన్న. పెదబాబుని నా చేత్తో పెంచాను. నా రెండో బిడ్డలాగా చూచుకున్నాను. ఆరిదీ నా కొడుకుదీ ఒకే ఈడు బాబూ! నాకున్న కొడుకు ఎలాగూ పోయాడు. ఇక ఈ బాబును కూడ దూరం చేసుకోనా? నా మూలంగా నా బిడ్డనే జైలుకి పంపించనా? నేనట్టా చేస్తానని మీరెట్టా అనుకున్నారు బాబూ! అయినా ఆ ముండ మాటలు యిని నన్నిట్టా చేశారు గాని పెదబాబుకి మాత్రం నేనంచే ఎంతిదో మీకు తెలియదా?'

పై పంచెతో కళ్లొత్తుకున్నాడు వెంకన్న.

వెంకన్న మాటలు కోటయ్యగారి హృదయాన్ని ఏం చేశాయోగాని 'పెదబాబూ' అని పెద్దగా కేకేశారు కోటయ్యగారు.

ఆ కేకకి వెంకన్న అదిరిపోయాడు.

పెదబాబు పరుగున మేడమీదికొచ్చాడు.

'కేసేమయిందిరా' కోటయ్యగారి మాటలు కదం తొక్కాయి.

'వెంకన్న దయవల్ల ఒడ్డున పడ్డాను నాన్నగారూ!'

'అయితే వెంకన్న...'

'నిజంగా నా పాలిటి దేవుడు. నేనే బుద్ధి గడ్డితిని...'

'నిజంగానా! నువ్వు నీ తప్పు ఒప్పుకొంటున్నావా! సంతోషంరా! చాల సంతోషం. అయితే ఒక పని చెయ్యి' కొడుకు ముఖంలోకి చూస్తూ అన్నారు కోటయ్యగారు.

ఆయనలో ఇందాకటి ఉద్వేగం కొంత తగ్గింది. ఏమిటన్నట్లు తన ముఖంలోకి చూస్తున్న పెదబాబుకు వెంకన్నను చూపిస్తూ 'నీకు క్షమాభిక్ష పెట్టినందుకు ఈ దేవుడి కాళ్ళమీద పడి కృతజ్ఞత తెల్పుకో' అన్నారు.

పెదబాబు వంగి వెంకన్న కాళ్ళందుకోబోయాడు. వెంకన్న దూరంగా జరిగి పెదబాబును పట్టుకొని మనిద్దరికీ నిజంగా యీ దొరగారే దేవుడు. ఆరి కాళ్ళకే దణ్ణం పెడదాం' అన్నాడు.

ఆ మాటకు కోటయ్యగారు తనను తాను సంబాళించుకో లేకపోయాడు గబగబ వచ్చి వెంకన్నను కౌగలించుకున్నాడు.

వాళ్ళిద్దరినీ ఆ విధంగా చూచిన మేడమీది కుండీలలోని చేమంతులు గులాబీలు ఒక్కసారిగా కమ్మతావితో ఆ ప్రదేశాన్నంతా గుబాళింపజేశాయి. □